నమస్తే తెలంగాణ

సిద్ధిపేట

I | హైదరాబాద్, శుక్రవారం 24 మే 2024 | SIDDIPET

పుల్కల్ మండలం కోడూరు సమీపంలోని రైస్ మిల్లు వద్ద ధాన్యం లోడ్‌తో బారులుదీరిన లారీలు

మహబూబాబాద్ జిల్లా మరిపెడలో గురువారం నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఓ చిన్నారిని ఒడిలో పెట్టుకుని మొబైల్ చూపిస్తూ లాలిస్తున్న దృశ్యం

- పలు కేంద్రాల్లో నిలిచిన ధాన్యం కొనుగోళ్లు
- కేంద్రాల్లో పేరుకుపోతున్న ధాన్యం నిల్వలు
- తీవ్రంగా లారీల కొరత
- ధాన్యం తీసుకోవడంలో మిల్లర్ల జాప్యం
- కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు
- తరుగు పేరిట దగాకు గురవుతున్న అన్నదాతలు
- రైతులకు డబ్బులు చెల్లింపుల్లోనూ జాప్యం

ఎక్కడి ధాన్యం అక్కడే..!

సంగారెడ్డి జిల్లాలో నత్తనడకన ధాన్యం సేకరణ

సంగారెడ్డి జిల్లాకు కూతవేటు దూరంలోని దాసుగడ్డ తండాలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో మూడు రోజులుగా ధాన్యం కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు పడిగాపులు కాస్తున్నారు. ధాన్యం బస్తాలున్న ట్రాక్టర్లు, వాహనాలను క్యూలో ఉంచిన రైతులు ధాన్యం ఎప్పుడు కొనుగోలు చేస్తారోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. కొనుగోలు కేంద్రంలో 24,000 క్వింటాళ్ల ధాన్యం నిల్వలు ఉన్నాయి. వీటిని రైసుమిల్లుకు తరలిస్తే తప్పా కొత్తగా రైతులు తీసుకువచ్చే ధాన్యం కొనుగోలు చేయలేని పరిస్థితి ఉంది. ధాన్యం బస్తాలను మిల్లుకు తరలించేందుకు వాహనాలు రావడం లేదు. దీంతో ఇస్మాయిల్‌ఖాన్‌పేట చుట్టుపక్కన ఉన్న ఏడు గ్రామాల రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ ఒక్క కేంద్రంలోనే కాదు జిల్లాలోని అందోలు, సంగారెడ్డి, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లోని పలు కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితి ఇలానే ఉంది. ధాన్యం సేకరణ సజావుగా సాగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తుపాను కారణంగా వర్షాలు వచ్చే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ చెబుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

దాసుగడ్డ కొనుగోలు కేంద్రానికి వాహనాలు రాకపోవడంతో ధాన్యం బస్తాలతో నిండుగా పేరుకుపోయిన గోదాం

సంగారెడ్డి, మే 23 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో ధాన్యం సేకరణలో అధికార యంత్రాంగం విఫలమైనట్లు స్పష్టంగా కనిపిస్తున్నది. ధాన్యం సేకరణకు సంబంధించి ప్రభుత్వశాఖల మధ్య సమన్వయ లోపం రైతులకు శాపంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యాసంగి సీజన్‌లో జిల్లాలో 1,96,219 టన్నుల క్వింటాళ్ల ధాన్యం సేకరించాలని పౌరసరఫరాల సంస్థ లక్ష్యం పెట్టుకుంది. కాగా, ఇప్పటి వరకు 92,043 టన్నుల ధాన్యం మాత్రమే సేకరించారు. ఇంకా 1.04 లక్షల టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉంది. జిల్లాలో చాలాచోట్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణను నిలిపివేశారు. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులకు చేర్చాల్సి ఉంటుంది. జిల్లాలో వాహనాల కొరత కారణంగా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. కొత్తగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయలేని పరిస్థితి ఉంది. జిల్లాలో నాలుగు రోజులుగా కొనుగోలు కేంద్రాలకు వాహనాలు రావడం లేదు. దీంతో అందోలు, నారాయణఖేడ్, సంగారెడ్డి నియోజకవర్గాల్లో చాలాచోట్ల ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి.జిల్లాలో 211 కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. ఆయా కొనుగోలు కేంద్రాల నుంచి జిల్లాలో 27 రైస్‌మిల్లులకు ధాన్యం తరలించేందుకు సుమారు 200 వరకు వాహనాలు అవసరం. పౌరసరఫరాల సంస్థ రెండు వాహన ఏజెన్సీల నుంచి కేవలం 50 వాహనాలకు టెండర్లు ఆహ్వానించినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం వాహన కాంట్రాక్టర్లు కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలించేందుకు అవసరమైన వాహనాలను పంపడం లేదు. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయి కొత్తగా ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదు. డిమాండ్‌కు అనుగుణంగా వాహనాలు ఏర్పాటు చేయనందుకు అధికారులు ఒక ఏజెన్సీని బ్లాక్‌లిస్టులో పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. కూలీల కొరత సైతం ధాన్యం సేకరణకు ఇబ్బందిగా మారింది. జిల్లాలో కొనుగోలు కేంద్రాలతో పాటు ధాన్యం బస్తాలను వాహనాల్లో చేర్చేందుకు కూలీలు అవసరం. గతంలో యూపీ, జార్ఖండ్, బీహార్‌కు చెందిన కూలీలు ధాన్యం సేకరణ, లోడింగ్, మిల్లుల్లో అన్‌లోడింగ్ పనులు చేసేవారు. ప్రస్తుతం వారంతా ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు తమసొంత గ్రామాలకు వెళ్లారు. దీంతో కూలీల కొరత ఏర్పడి ధాన్యం సేకరణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

తరుగు పేరుతో రైతుల దగా...

సంగారెడ్డి జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో రైతుల నుంచి అదనంగా నాలుగు కిలోల ధాన్యం సేకరిస్తుండడంతో రైతులు దగాకు గురవుతున్నారు. బస్తాలో తరుగు కలిపి 42 కిలోల ధాన్యం కాంటా వేయాల్సి ఉంటుంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల నుంచి 44 నుంచి 45 కేజీల వరకు ధాన్యం కాంటా వేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రతి బస్తాకు మూడు నుంచి నాలుగు కిలోలు తరుగు పేరుతో అదనంగా ధాన్యం కాంటా చేయడంతో తాము నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యంలో తాలు, మట్టి ఉందన్న నెపంతో తరుగు ఎక్కువగా చూపుతూ రైతుల నుంచి ఎక్కువ ధాన్యం కాంటా చేస్తున్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారు. రైతులు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించడం లేదు.

మిల్లర్ల జాప్యంతో ఇక్కట్లు

డీఆర్‌డీఏ అధికారులు ట్రక్‌షీట్లు రూపొందించడంలో జాప్యం చేయడం, మిల్లర్లు తమ వద్దకు వచ్చిన ధాన్యాన్ని అన్‌లోడింగ్ చేసుకోకపోవడంతో రైతులకు ఇబ్బందిగా మారింది. సంగారెడ్డి జిల్లాలోని 211 కేంద్రాల నుంచి సేకరించిన ధాన్యాన్ని ను 27 రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 92,043 టన్నుల ధాన్యం సేకరించగా..88,568 టన్నుల ధాన్యం రైసు మిల్లులకు చేరింది. రైసు మిల్లులకు ఇంకా 3474 టన్నుల ధాన్యం చేరాల్సి ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వాహనాల కొరత కారణంగా రైసు మిల్లులకు ధాన్యం చేరడం లేదు. ధాన్యం వాహనాలు వెళ్లినా మిల్లర్లు వెంటవెంటనే ధాన్యం బస్తాలను అన్‌లోడ్ చేయడం లేదు. దీంతో వాహనాలు మిల్లుల వద్ద బారులు తీరి కనిపిస్తున్నాయి. ఒక్కోలారీ అన్‌లోడ్ కావడానికి మిల్లర్లు రెండురోజుల సమయం తీసుకుంటున్నారు. దీంతో ధాన్యం తరలింపు వేగంగా సాగడం లేదు. డీఆర్‌డీఏ సేకరించిన ధాన్యం వివరాలను ట్యాబ్ ఎంట్రీ చేయడంతో పాటు ట్రక్‌షీట్ జనరేట్ చేయాల్సి ఉంటుంది. జిల్లాలో ఇప్పటివరకు 92,043 టన్నుల సేకరించగా..81,781 టన్నులకు ట్యాబ్ ఎంట్రీలు జరిగాయి. 70,064 టన్నుల ధాన్యానికి ట్రక్‌షీట్లు జనరేట్ చేశారు. దీంతో రైతులకు వెంటనే డబ్బులు అందడం లేదు. సంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 18,045 రైతుల నుంచి రూ. 202.77 కోట్ల విలువ చేసే ధాన్యం కొనుగోలు చేశారు. 11,039 మంది రైతులకు రూ.137 కోట్ల డబ్బులు చెల్లించారు. ఇంకా 7006 మంది రైతులకు రూ.65 కోట్లు చెల్లించాల్సి ఉంది.

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

సంగారెడ్డి జిల్లాలో రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరిస్తున్నాం. అక్కడక్కడ చిన్న పాటి సమస్యలు ఉత్పన్నమైనా వెంటనే గుర్తించి వాటిని పరిష్కరిస్తున్నాం. ధాన్యం కొనుగోళ్లు ఎక్కడైనా నిలిచినట్లు తెలిస్తే వెంటనే కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నాం. వాహనాల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. సకాలంలో వాహనాలు ఇవ్వనందుకు వాహన ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో చేర్చే అంశాన్ని పరిశీలిస్తున్నాం. తరుగు సమస్య ఎక్కడా లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా రైతులు ఇబ్బందులు పడితే వెంటనే సిబ్బందిపై చర్యలు తీసుకుంటున్నాం. మరో పదిరోజుల్లో ధాన్యం సేకరణ వందశాతం పూర్తి చేస్తాం. రైతులు ఆందోళన చెందవద్దు. చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం.

– మాధురి, అదనపు కలెక్టర్, సంగారెడ్డి జిల్లా

(ఇన్‌సెట్‌లో) ధాన్యం తడవకుండా కవర్లు కప్పిన రైతులు

సంగారెడ్డి మండలం దాసుగడ్డ తండాలో కొనుగోళ్లు నిలిపివేయడంతో బయట ధాన్యం బస్తాలతో బారులుదీరిన ట్రాక్టర్లు

చేర్యాలలో 4679 మంది ఓటర్లు

- ఓటు వేసేందుకు పట్టభద్రులు రెడీ
- విస్తృతంగా ప్రచారం చేస్తున్న పార్టీలు

చేర్యాల, మే 23 :వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్ ఈనెల 27న జరుగనున్నది. సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం పరిధిలోకి వస్తుండడంతో ఈ ప్రాంతంలోని పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు. చేర్యాల సబ్ డివిజన్ పరిధిలోని చేర్యాలలో 1558 ఓటర్లుకు గానూ 1686 మంది పురుషులు, 869 మహిళలు, కొమురవెల్లిలో 678 ఓటర్లలో 447 మంది పురుషులు, 231 మంది మహిళలు, మద్దూరులో 935 మంది ఓటర్లలో 642 మంది పురుషులు, 293 మంది మహిళలు, ధూళిమిట్టలో 511 మంది ఓటర్లలో 346 మంది పురుషులు, 165 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అన్నివర్గాలకు చెందిన ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రధాన పార్టీలు ప్రచారానికి తెరలేపాయి. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తనదైన శైలిలో జనగామ, చేర్యాల ప్రాంతాల్లో పట్టభద్రులు బీఆర్ఎస్‌కు ఓటు వేసేలా ప్రచారం చేస్తున్నారు.

5 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

చేర్యాల సబ్ డివిజన్‌లో పరిధిలో 4679 మంది గ్రాడ్యుయేట్స్ ఓటు వేసేందుకు ఎన్నికల అధికారులు 5 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. చేర్యాలలో 2, కొమురవెల్లి 1, మద్దూరులో 1, ధూళిమిట్టలో 1 పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలో గ్రాడ్యుయేట్స్ బ్యాలెట్ పేపర్‌లో తమ అభ్యర్థులకు ప్రాధాన్యతను రూపంలో ఓటు వేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ రెండు రోజుల క్రితం ఉప ఎన్నిక ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, సీపీలతోపాటు హుస్నాబాద్ ఏసీపీ, చేర్యాల సీఐ శ్రీనులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు.

18 మంది అభ్యర్థులు

వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానానికి 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈనెల 27న పోలింగ్ జరగనుండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తున్నారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామ ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించడంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక జరుగుతున్నది. ఈ ఎన్నికల్లో ఓటు వేసేందుకు కొత్తగా 1000 మందికి పైగా ఓటర్లు నమోదు చేసుకున్నారు. బీఆర్ఎస్ నుంచి విద్యావంతుడైన ఏనుగుల రాకేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి చింతపండు నవీన్‌కుమార్, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పోటీలో ఉన్నారు.

అక్కన్నపేటలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పంచాయతీలకు నిధులివ్వండి

- ఎంపీడీవోకు పంచాయతీ కార్యదర్శుల వినతి
- 'నమస్తే తెలంగాణ' కథనంపై స్పందించిన పంచాయతీ కార్యదర్శులు

అక్కన్నపేట, మే 23: గ్రామ పంచాయతీల నిర్వహణకు నిధులు విడుదల చేయాలని కోరుతూ మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు గురువారం ఎంపీడీవో భానోతు జయరామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ... నాలుగైదు నెలల నుంచి గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విడుదల కాకపోవడంతో తమపై ఆర్థిక భారం పడుతోందన్నారు. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన కొసాగుతోందన్నారు. గతంలో అభివృద్ధి పనులను గ్రామ సర్పంచ్‌లు చేసేవారని, ఇప్పుడు అలాంటి అవకాశం లేదని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల నిర్వహణ భారంగా మారిందన్నారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి చేరవేసి నిధులు మంజూరు చేయాలని కోరారు. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎంపీడీవో హామీఇచ్చారు. గురువారం 'నమస్తే తెలంగాణ'లో 'ఈ భారం మోయలేము' అనే వార్త కథనం అంతటా చర్చనీయాంశంగా మారింది. పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలపై 'నమస్తే తెలంగాణ' కథనం అద్దం పడుతుందని పలువురు కార్యదర్శులు పేర్కొన్నారు.

గొర్రెల మందపై అడవి జంతువులు దాడి

- మాచాపూర్‌లో 70 గొర్రెలు మృతి

చిన్నకోడూరు, మే 23 : సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మాచాపూర్‌లో పున్నం మల్లయ్యకు చెందిన గొర్రెల మందపై అడవి జంతువులు దాడిచేయగా 70 గొర్రెలు మృతి చెందాయి. బాధితుడి వివరాల ప్రకారం.. పున్నం మల్లయ్య రోజు మాదిరిగా తన వ్యవసాయబావి వద్ద గల షెడ్డులో గొర్రెలు ఉంచి ఇంటికి వెళ్లాడు. రాత్రి ఒంటిగంట సమయంలో వర్షానికి వడ్లు తడుస్తాయని భావించి వ్యవసాయబావి వద్దకు వచ్చి ధాన్యంపై టార్పాలిన్లు కప్పాడు. అప్పుడు గొర్రెల షెడ్డులో ఎలాంటి సంఘటన జరగలేదు. తెల్లవారుజామున 4గంటలకు షెడ్డు వద్దకు వెళ్లగా 70 గొర్రెలు మృతిచెంది కనిపించాయి. మరో 20 గొర్రెలు తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతూ కనిపించాయి. మొత్తం 120 గొర్రెలు ఉండగా.. కొన్ని గొర్రెలు భయంతో అక్కడి నుంచి పారిపోయాయి. సుమారుగా రూ.7 లక్షల నష్టం తనకు వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. ఫారెస్ట్ రేంజ్ అధికారి ఇక్రముద్దీన్, సెక్షన్ అధికారి బుచ్చయ్య సంఘటనా స్థలానికి చేరుకుని అడవి జంతువు పాద ముద్రలను గుర్తించారు. హైనా, తోడేళ్లు దాడిచేసి ఉండవచ్చని అంచనా వేశారు. రాత్రి పరిసర ప్రాంతాల్లో బోను, కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని ఓదార్చి, మనోధైర్యం నింపారు. ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లి ఆర్థికసాయం అందేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. రైతులు ఆపదలో ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్, ఎంపీటీసీ జమున ఎల్లయ్య, ఎఫ్‌పీవో చైర్మన్ వెంకట్‌రెడ్డి, పశు వైద్యురాలు మంజుల, మాజీ సర్పంచ్ గాజుల బాబు, నాయకులు రాజిరెడ్డి, రాజారెడ్డి ఉన్నారు.

మాచాపూర్‌లో గొర్రెల కళేబరాలను పరిశీలిస్తున్న ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి

జూన్ 31లోగా కుటుంబ సర్వే పూర్తి చేయాలి

సంగారెడ్డి కలెక్టరేట్, మే 23: కుటుంబ సర్వేను జూన్ 31లోగా పూర్తి చేయాలని మహిళా సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి వాకాటి కరుణ అధికారులకు సూచించారు. గురువారం మహిళా సంక్షేమ శాఖ డైరెక్టర్ నిర్మలాక్రాంతి వెస్లీతో కలిసి వాకాటి కరుణ హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు,0 నుంచి ఆరేండ్లలోపు పిల్లలను గుర్తించి నమోదు చేయాలని పేర్కొన్నారు. పిల్లల పెరుగుదలను కచ్చితంగా గుర్తించాలన్నారు. వయస్సుకు తగిన బరువు (ఎస్‌యూడబ్ల్యూ), ఎత్తుకు తగిన బరువు, చురుకుదనాన్ని కరెక్ట్‌గా నమోదు చేయాలన్నారు. ఎన్‌ఎఫ్‌హెచ్ఎస్-5 డేటాతోని పోల్చుకొని ప్రతి పిల్లవాడిని గుర్తించాలన్నారు. విలేజ్ హెల్త్ రిజిస్టర్‌లో నమోదైన డేటాతో సరి చూసుకోవాలన్నారు. ప్రీ స్కూల్ విద్యకు సంబంధించి సిలబస్ సులభతరంగా, అంతర్జాతీయ ప్రమాణాలతో ఉండేలా కరిక్యులమ్‌ని తయారు చేస్తున్నామని తెలిపారు. అందుకనుగుణంగా పూర్వ ప్రాథమిక విద్యను అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందించాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారి లలితకుమారి, ఈడీపీవోలు, సూపర్‌వైజర్లు, పోషణ్ అభియాన్ సిబ్బంది తదితర అధికారులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకునేందుకే పంటల బీమా

సంగారెడ్డిలో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకుడు గోపి, పక్కన కలెక్టర్ వల్లూరు క్రాంతి, అధికారులు

- రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకుడు గోపి
- ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన'పై రైతులకు అవగాహన కల్పించాలి
- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మే 23: ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం జరిగినప్పుడు రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు పంటల బీమా పథకం ఉపయోగపడుతుందని వ్యవసాయ శాఖ రాష్ట్ర సంచాలకుడు గోపి తెలిపారు. గురువారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు, ప్రణాళిక శాఖ అధికారులు,అభ్యుదయ రైతులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి మాట్లాడుతూ.. రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు' ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన' పంట బీమా పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం వానకాలం 2024 నుంచి పీఏంఎఫ్‌బీవై స్కీంలో చేరాలని నిర్ణయించిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పంట బీమా పథకం రైతులకు అందాలంటే రైతు ఏ పంట పండిస్తున్నాడనే వివరాలు పక్కాగా నమోదై ఉండాలని స్పష్టం చేశారు.ఈ బీమా ప్రయోజనాల గురించి గ్రామ సభల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఏఈవోల సమన్వయంతో వ్యవహరించి ఈ బీమా ప్రయోజనాలు రైతులు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఉచితంగా ఈ బీమా వర్తిస్తుందని, రైతుల ప్రీమియం వాటాను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల వ్యవసాయశాఖ అధికారులు నర్సింహారావు, శివప్రసాద్, గోవింద్, సీపీవోలు బలశౌరి, చంద్రశేఖర్ రాజు, మాన్య, ఉద్యాన శాఖ అధికారులు సోమేశ్వర్‌రావు, నర్సయ్య, ఆదర్శ రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ పూర్తి చేయాలి

- వారం రోజుల్లో మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలి
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

కొల్చారం, మే 23: వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేయాలని అధికారులకు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. గురువారం కొల్చారం మండలం వరిగుంతంలోని కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కేంద్రంలోని వడ్లు తొందరగా కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ధాన్యం లారీలో లోడ్ చేసిన వెంటనే రైస్‌మిల్లులకు పంపించాలన్నారు. నిర్లక్ష్యాన్ని సహించమన్నారు.ట్యాబ్ ఎంట్రీ విషయంలో పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. లారీలు త్వరగా తెప్పించి ధ్యాన్యాన్ని పంపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రం సిబ్బంది తూకాల్లో మోసాలు జరగకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంట పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, తహసీల్దార్ గఫార్‌మియా, ఆర్ఐ ప్రభాకర్, జడ్పీటీసీ మేఘమాల సంతోష్‌కుమార్, సొసైటీ చైర్మన్ ప్రభాకర్, సీఈవో రాములు, గోవర్ధన్, రైతులు ఉన్నారు.

పాఠశాలల పనులు వేగవంతం చేయాలి

కొల్చారం,మే 23 : మండలంలోని పోతన్‌శెట్టిపల్లి చౌరస్తా, సంగాయిపేట గ్రామాల్లో కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం పర్యటించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద చేపట్టిన పనులను పరిశీలించారు. పాఠశాలల భవనాలు, మరుగుదొడ్లు, విద్యుత్ పరికరాల మరమ్మతులు, తాగునీటి సరఫరా వంటి సదుపాయాలపై దృష్టి సారించాలన్నారు. ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. కలెక్టర్ వెంట డీఈవో రాధాకృష్ణ, ఎంఈవో నీలకంఠం, ఏఈ మహేశ్ ఉన్నారు.

వరిగుంతంలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

విలేకరుల వేధింపులు భరించలేకపోతున్నాం

హుస్నాబాద్ ట్రాక్టర్ యజమానుల సంఘం ఫిర్యాదు

హుస్నాబాద్, మే 23: హుస్నాబాద్‌లోని పలు ఇండ్ల నిర్మాణాలకు మట్టిని తరలిస్తున్న తమను కొందరు విలేకరులు వేధింపులకు గురిచేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని హుస్నాబాద్ పట్టణ ట్రాక్టర్ యజమానుల సంఘం ఆధ్వర్యంలో గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పలువురు రైతులకు చెందిన పట్టా భూముల్లోంచి మట్టిని తీసి ఇంటి యజమానుల కోరిక మేరకు మట్టిని తరలిస్తుంటే కొందరు విలేకరులమని చెప్పి బెదిరింపులకు గురిచేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. పలుమార్లు వారికి డబ్బులు ఇచ్చామని మళ్లీ ఇవ్వాలని నిత్యం వేధిస్తూ ఉపాధి లేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. పట్టా భూముల యజమానుల అనుమతితో మట్టి తరలిస్తుంటే అక్రమంగా తరలిస్తున్నారంటూ డబ్బులు ఇవ్వకుంటే అధికారులకు ఫిర్యాదు చేస్తామని వార్తలు రాస్తామని బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణానికి చెందిన పది మంది విలేకరులు నిత్యం ట్రాక్టర్ యజమానులను, డ్రైవర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని పదిమంది పేర్లతో కూడిన జాబితాను పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుతోపాటు అందించినట్లు హుస్నాబాద్ ట్రాక్టర్ యజమానుల సంఘం అధ్యక్షుడు పినికాశి మల్లేశం తెలిపారు. ఈ విషయంపై ఎస్సై మహేశ్‌ను వివరణ కోరగా, విలేకరులపై ఫిర్యాదు చేశారన్నారు.

రంగంపేటలో ధ్యానం తడవడంతో పట్టాలు కప్పుతున్న రైతులు

అకాల వర్షానికి తడిసిన ధాన్యం

కొడిపల్లి, మే 23 : అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దవడంతో రైతులు ఆందోళన చెందారు. గురువారం మండలంలో పలుచోట్ల అకాల వర్షం కురిసింది. సాయంత్రం రంగంపేట, సంగాయిపేట గ్రామాల్లో గాలివానకు చెట్టు కొమ్మలు విరిగి కరెంట్ తీగలపై పడడంతో స్తంభం ఒరిగి ప్రమాదకరంగా మారింది. అకాల వర్షానికి ధాన్యం తడవడంతో రైతులు తిప్పలు పడ్డారు.

ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మే 23: వానకాలం సమీపిస్తున్నందున జిల్లాలో ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నకిలీ ఎరువులు, విత్తనాలు అమ్మకుండా కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. జిల్లాకు 5,881క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు కేటాయించారని, ఇప్పటివరకు 2,083 క్వింటాళ్లు వచ్చినట్లు తెలిపారు. జిల్లాలో 7 లక్షల 20 వేల పాకెట్ల పత్తి విత్తనాలు అవసరమని పేర్కొన్నారు. అందుకనుగుణంగా విత్